క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మైదుకూరు: మైదుకూరు పట్టణంలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ రామభద్రయ్య ఓ ప్రకటనలో తెలిపారు. మరమ్మతులు అవసరమైన చోట ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల మధ్యలో ఏ సమయంలో అయినా విద్యుత్ అంతరాయం కలుగుతుందని ఏఈ పేర్కొన్నారు. కావున ప్రజలందరూ సహకరించాలని కోరారు.

స్పీడ్ బ్రేకర్లు తొలగింపు

గోపవరం: మండలంలోని పిపి.కుంట–బ్రాహ్మణపల్లె మధ్య స్పీడ్ బ్రేకర్లను జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్అండ్‌బీ అధికారులు గురువారం తొలగించారు. 15 కిలోమీటర్ల పరిధిలో దాదాపు 30 స్పీడ్ బ్రేకర్లు ఉండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బస్సు డ్రైవర్లు ఆ రూటులో వెళ్లమని మొండికేయడంతో సర్వీసు కూడా నిలిపివేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. స్థానికులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన స్పందించి స్పీడ్‌బ్రేకర్లు తొలగించాలని అధికారులను ఆదేశించారు. గురువారం వాటిని తొలగించారు.

పుస్తకాల పంపిణీ



దాతలు ఇచ్చిన పుస్తకాలతో విద్యార్థులు

బద్వేలు అర్బన్: పోరుమామిళ్ల చిత్తాశౌరిరెడ్డి మెమోరియల్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మండలంలోని కొత్తచెరువు, కోనసముద్రం ఆర్సీఎం ప్రాథమిక పాఠశాలలు, నందిపల్లెలోని సెయింట్ మేరీస్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఇన్ నీడ్ సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ గీత, తోమాస్‌రెడ్డి రాతపుస్తకాలు ఉచితంగా గురువారం పంపిణీ చేశారు. సంస్థ ప్రతినిధి ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ దాతల సహకారాన్ని అందిపుచ్చుకుని ఉత్తమ పౌరులుగా ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

పీర్ల ఊరేగింపు



ఏటికి వెళుతున్న పీర్లు

బి.కోడూరు: బి.కోడూరులో గురువారం కుల మతాలకతీతంగా మొహర్రం వేడుక ఘనంగా నిర్వహించారు. పీర్లకు భక్తులు చదివింపులు చేయించి మొక్కులను తీర్చుకున్నారు. భక్తులు అగ్నిగుండం ప్రవేశం చేశారు. సాయంత్రం పీర్లను ఊరేగింపుగా స్నాన ఘట్టానికి తీసుకెళ్లారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పాల్గొని పీర్లకు బొరుగులు, చక్కెర చదివించారు.

కాశినాయన: మండలంలోని ఆకులనారాయణపల్లెలో గత నాలుగు రోజులుగా కొలువుదీరిన పీర్లను గురువారం ఏటికి సాగనంపారు. డప్పు వాయిద్యాల మధ్య యువకులు పీర్లను ఊరేగించారు. కులాల మతాలకు అతీతంగా గ్రామ ప్రజలంతా కార్యక్రమంలో పాల్గొన్నారు. పీర్లకు భక్తులు చక్కెర చదివించారు.

గురువుదే ప్రత్యేక స్థానం

పోరుమామిళ్ల: సమాజంలో గురువుకు ప్రత్యేక స్థానముందని ఉపాధ్యాయులు కుర్రా చెన్నకృష్ణయ్య, జనార్దనశెట్టి అన్నారు. గురుపౌర్ణమి సందర్భంగా ధ్యానమండలి యోగా గురువు గురివిరెడ్డిని సాధకులు శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లిదండ్రుల తర్వాత గురువుకు హిందూ సంస్కృతిలో అత్యధిక ప్రాధాన్యం ఉందన్నారు. ఉపాధ్యాయులు పోలేపల్లె వెంకట సుబ్బయ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. మరో కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు నాగేంద్ర, రమణాచారి, పండరి, మోహన్‌రెడ్డి, బ్రహ్మయ్య, జయరాం పూలమాలతో ఘనంగా సన్మానించారు.

కన్యకాపరమేశ్వరికి పూజలు

పోరుమామిళ్ల: ఆషాడ పౌర్ణమి సందర్భంగా పోరుమామిళ్ల వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి ఆర్య వైశ్య మహిళలు వడి బియ్యం సమర్పించారు. వాసవీ మహిళా మండలి అధ్యక్షురాలు పలుకూరి రాధ ఆధ్వర్యంలో మహిళలు వడి బియ్యం, గోరింటాకుతో అష్టోత్తర శతనామావళి జరిపించారు. విశ్వనాథప్రసాద్, శేఖర్, పాల్గొన్నారు.

గోడ కట్టారని నిరసన

ప్రొద్దుటూరు: పెద్దశెట్టిపల్లె గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన మేరి ఝాన్సీ కుటుంబసభ్యులు గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. గ్రామానికి చెందిన వ్యక్తి తాము నడిచే రోడ్డుపై అడ్డంగా గోడ కట్టి ఆక్రమించుకున్నాడన్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ నిధులతో రోడ్డు వేసినా దౌర్జన్యంగా గోడ నిర్మించడంతో తాము నడవడానికి వీలు లేకుండా పోయిందన్నారు. పలు మార్లు పోలీసుల వద్ద పంచాయితీ జరిగినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. అన్యాయాలు చేస్తున్న వారికి పోలీసులు మద్దతుగా నిలుస్తున్నారని వారు ఆరోపించారు. అనంతరం తహసీల్దార్ గంగయ్యకు వినతి పత్రం సమర్పించారు. సమస్యను పరిష్కరించకపోతే శుక్రవారం తాలూకా పోలీస్‌స్టేషన్ వద్ద ధర్నాకు కూర్చుంటామని తెలిపారు. మేరి ఝాన్సీ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సాగునీటి కోసం.. ఎదురుచూపు

ఖరీఫ్ సీజన్ మొదలైంది. ఆకాశంలోని కారు మబ్బులు రైతులను ఊరిస్తూ.. ఉసూరుమనిపిస్తున్నాయి. రైతన్న వరుణదేవుని కరుణ కోసం ఆశగా ఎదురు చూస్తూనే ఉన్నారు. వర్షం లేక కేసీ కాలువకు నీరు వస్తుందన్న ఆశతో.. రైతులు పంట భూముల సేద్యం చేసి సాగు నీటి కోసం ఎదురుచూస్తున్నారు.

- పెరిగిన విత్తన ధరలు
- అరకొరగా పచ్చిరొట్టి పంపిణీ



సాగుకు సిద్ధంగా ఉన్న భూములు



నీరులేని కేసీకెనాల్ కాలువ

ఖాజీపేట: ప్రతి ఏటా ఆలస్యంగా వర్షాలు కురవడంతో సాగు ఆలస్యంగానే మొదలవుతుంది. ఖరీఫ్ సీజన్ కావడంతో జూలై నెల నుంచి రైతులు బీడు భూములు దుక్కి దున్నడం, అలాగే జీలుగ, జనుములు సాగు చేయడంతోపాటు వరి నారుమళ్లు వేయడంలో బిజీగా ఉంటారు. అయితే ఇటు కేసీ కాలువకు నీరు రాక, వర్షాలు కురుస్తాయనే ఆశతో సర్వ సన్నద్ధతతో ఉన్నారు. బోరు బావులకింద ఇప్పటికే సాగు పనులు మొదలుపెట్టారు.

రాయితీపై జీలుగ పంపిణీ

ఖాజీపేట మండలంలో ఏటా రైతులకు రాయితీపై జీలుగ, జనుము పంపిణీ జరుగుతోంది. ఈ ఏడాది రైతులకు కావాల్సిన మోతాదుకంటే తక్కువగా పచ్చి రొట్ట విత్తనాలు మంజూరుచేశారు. కేవలం 30 క్వింటాళ్ల జీలుగ, 150 క్వింటాళ్ల జనుము వంజూరు చేశారు. వాస్తవానికి ఖాజీపేట మండలంలో వరి సాగు అధికంగా ఉండడంతో 400 క్వింటాళ్ల జీలుగ, 300 క్వింటాళ్ల జనుము అవసరం ఉంటుంది. అధికారులు 100 క్వింటాళ్లు మాత్రమే అందజేశారు. దీంతో కొరత ఏర్పడింది.

విత్తన ధరకు రెక్కలు

ఖాజీపేట మండలంలో వరి సాగు అధికం. వడ్ల అమ్మకాలు జోరుగా సాగుతాయి. ఏటా అమ్మకాల కంటే ఈ ఏడాది వడ్లు ధర బాగా పెరిగినట్లు తెలుస్తోంది. ఖాజీపేటలో ఎడీఎల్ఆర్ రకం 25 కిలోల ధర రూ.1100, కెయస్ఎం 1638 రకం, బిపీటీ 5204 రకం, జగిత్యాల రకం 30 కిలోల ప్యాకెట్ రూ.1350 చొప్పున విక్రయాలు జరుపుతున్నారు. గత ఏడాదిలో విత్తన వడ్ల కొరత ఉండడంతో ధర భారీగా పెంచి అమ్మడం జరిగింది. ఈ ఏడాది వడ్ల ధర బాగా పెరిగిందని రైతులు చెబుతున్నారు. ఇక పచ్చిరొట్ట విత్తనాలైన జీలుగలు పది కిలోలు రూ.615, జనుము 10కిలోలు రూ.545కు విక్రయిస్తున్నారు. ఇవి సరిపడా ప్రభుత్వం సరఫరా చేయకపోవడంతో రైతులు పది కిలో ప్యాకెట్ జీలుగ రూ.1200, జనుము రూ.1000 పెట్టి కొనుగోలు చేయాల్సి వస్తోంది. పిల్లపెసర విత్తనాలు మంజూరు కాలేదు. బ్లాక్ మార్కెట్‌లో కొనుగోలు చేయాల్సి వస్తోంది.

ఖాజీపేట మండలంలో చెరువు ఆయకట్టు వివరాలు

చెరువులు	విస్తీర్ణం	ఆయకట్టు
కన్నెలవాగు	61.88	829.06
నాగసానిపల్లె చెరువు	44.48	225.13
పుల్లూరు చెరువు	91.51	340.45
రావులపల్లె చెరువు	95.90	183.55
దుంపలగట్టు చెరువు	67,07	159.98
చెమ్ముళ్ళపల్లె చెరువు	102.83	361.21
నందిపాడు చెరువు	83.23	310

2019 నుంచి 2025 వరకు కేసీ కెనాల్ ఆయకట్టుకు నీరందించిన రోజులు

సంవత్సరం	నుంచి	వరకు
2019	10-8-2019	30-3-2020
2020	01-8-2020	30-4-2021
2021	01-08-2021	11-4-2022
2022	11-8-2022	30-4-2023
2023	11-10-2023	9-1-2024
2024	02-8-2024	15-4-2025

రైతులకు అవసరమైన విత్తనం అందించాలి

రైతులకు కావాల్సినంత పచ్చిరొట్ట విత్తనాలు పూర్తిస్థాయిలో అందించాలి. అరకొర పంపిణీతో పంట సాగు పెట్టుబడి పెరిగి రైతు ఇబ్బందిపడుతున్నారు. అధిక ధర చెల్లించి బ్లాక్‌లో కొంటున్నారు. కరవు ప్రాంతమైన ఖాజీపేట మండలంలో కనీసం విత్తనాలైనా రైతులకు రాయితీపై అందించాలి.

– నాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం అధ్యక్షుడు

విత్తనం పంపిణీ చేస్తున్నాం

ఖాజీపేట మండలంలో పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ జరుగుతోంది. గతంలో జీలుగ 30 క్వింటాళ్లు మంజూరైతే తాజాగా 130 క్వింటాళ్లు ఇస్తున్నాం. జనుము వంద క్వింటాళ్లు ఇచ్చాం. రైతులుంతా వారి గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో విత్తనం తీసుకోవచ్చు.

– నాగార్జున, వ్యవసాయాధికారి, ఖాజీపేట

మా స్థలాలను మాకు ఇప్పించండి



నిరసన తెలుపుతున్న లబ్ధిదారులు

కాశినాయన: ప్రభుత్వం 2021లో ఇచ్చిన స్థలాలను తమకు ఇప్పించాలని మండలంలోని కేఎస్.కొట్టాల ఎస్సీ కాలనీ వాసులు కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం వారు నిరసన తెలిపారు. మండల సీపీఎం కార్యదర్శి పోలయ్య, ఏపీ దళిత వేదిక జిల్లా కన్వీనర్ ఓబులేసు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 2021లో దళితులకు కత్తెరగండ్ల రెవెన్యూ పొలంలోని రెడ్డికొట్టాల గ్రామంలో 25 మందికి పట్టాలు ఇచ్చారన్నారు. వాటికి గృహాలు కూడా మంజూరు చేశారని తెలిపారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఇళ్లు నిర్మించుకోలేదని, ఇపుడు పొలాల్లోకి వెళితే అక్కడి దళితులు స్థానిక టీడీపీ నాయకుల మద్దతుతో స్థలాలు లేవని బెదిరిస్తున్నారని తెలిపారు. రెవెన్యూ అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు. లేనిపక్షంలో కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. అనంతరం తహసీల్దారు వెంకటసుబ్బయ్యకు వినతిపత్రం అందజేశారు.

ఎఫ్‌సీ ప్రక్రియ బద్వేలులోనే కొనసాగించాలి



ఎంవీఐకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

బద్వేలు అర్బన్: వాహనాల ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ప్రక్రియను గతంలో మాదిరిగా బద్వేలులోనే కొనసాగించాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ నాయకులు కోరారు. మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ శేఖర్‌రావును గురువారం వారు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా స్టాండింగ్ కమిటీ సభ్యులు చంద్రశేఖర్ మాట్లాడుతూ ఎఫ్‌సీ ప్రక్రియ కడపకు మార్చడంతో నియోజకవర్గంలోని కలసపాడు, కాశినాయన మండలాలకు చెందిన వాహన దారులు 130 కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి వస్తోందన్నారు. నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థులను చేరవేస్తున్న ప్రైవేటు పాఠశాలల బస్సులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో చంద్రమోహన్‌రాజు, జకరయ్య, రామరాజు, బాబు, విజయరావు, నారాయణ, జయరామరాజు, చంద్రపాల్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులకు సన్మానం



సిబ్బందిని సన్మానిస్తున్న గ్రామస్థులు



ఉద్యోగులను సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కలసపాడు: మండలంలోని మహానందిపల్లె సచివాలయంలో పనిచేస్తూ బదిలీపై వెళ్లిన ఆరుగురు సచివాలయ ఉద్యోగులను వైఎస్సార్‌సీపీ నాయకులు బి.భాస్కర్‌రెడ్డి, జి.నాగేశ్వర్ రెడ్డిలు గురువారం ఘనంగా సత్కరించారు.

చాపాడు: మండలంలోని సోమాపురం సచివాలయంలో బదిలీపై వెళ్తున్న సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్ సుదర్శన్‌రెడ్డి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ అలీ, ఏఎన్ఎం రెడ్డికుమారి, మహిళా పోలీస్ కళావతి, అగ్రికల్చర్ అసిస్టెంట్ పుష్పలతలను వెంకటరామిరెడ్డి, వెంకటసుబ్బయ్య, పెద్దన్న, శ్రీనివాసుల రెడ్డి, తదితరులు ఘనంగా సత్కరించారు.

మహంకాళి అమ్మవారికి సారె పండగ



అమ్మవారికి సారె, చీర తీసుకువస్తున్న భక్తులు



శాకంబరిగా పార్వతీదేవి

బి.కోడూరు: మండలంలోని మున్నెల్లి గ్రామంలో వెలసిన మహంకాళి అంకాలమ్మ అమ్మవారి బోనాల సారె పండగ గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి అభిషేకం చేసి ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం ఊరేగింపుగా వచ్చి గోమాతకు సీమంతం, చీర, సారె కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. వచ్చిన భక్తులకు అన్నదానం నిర్వహించారు.

రాజుపాళెం: మండలంలోని భీమలింగేశ్వరాలయంలో పార్వతీదేవిని కూర, ఆకుకూరలు, మల్లె, జాజి పూలతో శాకంబరిగా అలంకరించారు.

పోలీసులకు ఉచిత వైద్య పరీక్షలు



శిబిరాన్ని ప్రారంభిస్తున్న డీఎస్పీ

ప్రొద్దుటూరు క్రైం: స్థానిక గాంధీ రోడ్డులోని హోలిస్టిక్ హాస్పిటల్‌లో ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, మైదుకూరు సబ్ డివిజన్ల పరిధిలో ఉన్న పోలీసు అధికారులు, సిబ్బందికి గురువారం ఉచిత వైద్య పరీక్షలను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని డీఎస్పీ భావన ప్రారంభించారు. ఈ నెల 25 వరకు వైద్య పరీక్షలను నిర్వహించనున్నట్లు డీఎస్పీ తెలిపారు. జనరల్ హెల్త్ చెకప్, డయాబెటీస్, కిడ్నీ, లివర్, కార్డియాక్‌లకు సంబంధించిన ప్రొఫైళ్లకు సంబంధించి స్పెషలిస్టుల పర్యవేక్షణలో పూర్తి స్థాయి పరీక్షలను నిర్వహిస్తారని నిర్వాహకులు పేర్కొన్నారు. పోలీసు సిబ్బంది ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి



మాట్లాడుతున్న పీవీ.శివారెడ్డి

ప్రొద్దుటూరు: ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పీవీ.శివారెడ్డి అన్నారు. స్థానిక నజరుల్లా కమిటీ ఫంక్షన్ హాల్‌లో ఏడీసీ వైఆర్‌కే రెడ్డి అధ్యక్షతన అసోసియేషన్ సర్వసభ్య సమావేశం గురువారం జరిగింది. శివారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర కమిటీతో మాట్లాడిన విషయాలను కూలంకషంగా ఉద్యోగులకు వివరించారు. అనంతరం ప్రొద్దుటూరు డిపో ఉద్యోగుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో పి.సుధాకర్, సుబ్బారావు, కె.వల్లి, కేవీ.కృష్ణారెడ్డి, అయ్యవారప్ప, చంద్రహాస్‌రెడ్డి, టీఆర్‌జీ.రెడ్డి, పి.భానుప్రసాద్, అశోక్ పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో గురు పౌర్ణమి



ప్రొద్దుటూరు వసంతపేటలో



బ్రహ్మంగారి సన్నిధిలో పూజలు



బి. మఠంలో శివకుమారస్వామి పూజలు

ప్రొద్దుటూరు కల్చరల్: గురు పౌర్ణమి పురస్కరించుకుని పట్టణంలోని సాయిబాబా ఆలయాలు గురువారం భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచి బాబాను దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. స్థానిక వసంతపేటలోని ఆలయంలో బాబా విగ్రహానికి పంచామృతాభిషేకం, గో క్షీరాభిషేకం చేసి పట్టువస్త్రాలు, రంగురంగల పూలదండలతో శోభాయమానంగా అలంకరించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటుచేశారు. వైఎంఆర్ కాలనీలోని దత్త పీఠంలో దత్తాత్రేయ స్వామికి ప్రత్యేక అలంకరణ చేశారు. లోకకల్యాణార్థం గణపతి, నవగ్రహ, దత్తాత్రేయహోమాలను నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. మధ్యాహ్నం అన్న ప్రసాద వినియోగం జరిగింది. సాయంత్రం దత్తాత్రేయస్వామి, అనఘా దేవి కళ్యాణోత్సవం నిర్వహించారు. వైఎంఆర్ కాలనీలోని బాబా ఆలయంలో వివిధ రకాల పూలతో స్వామిని సుందరంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి చేరుకుని కాయకర్పూరాలను నైవేద్యంగా సమర్పించారు. భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం చేశారు. దొరసానిపల్లె ఆలయంలో బాబాకు ప్రత్యేక పూజలు చేశారు. నిర్వాహకులు అన్న ప్రసాదం పంపిణీ చేశారు. శివాలయం వీధిలో శ్రీపాద వల్లభ సేవా సంఘం ఆధ్వర్యంలో దత్తాత్రేయ స్వామి చిత్రపటానికి పూజలు చేసి అన్నదానం నిర్వహించారు.

చాపాడు: మండలంలోని లక్ష్మీపేట సాయిబాబా ఆలయంలో కేసీ కెనాల్ ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ ద్వార్శల గురివిరెడ్డి ఆధ్వర్యంలో గురు పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. భక్తులకు అన్న ప్రసాదం పంపిణీ చేశారు. బాబా దర్శనానికి వచ్చిన అధికారులు, ప్రజాప్రతినిధులను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ రాజేంద్రప్రసాద్, తహసీల్దారు రమాకుమారి, కృష్ణారెడ్డి, శివశంకర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

గోపవరం: మండలంలోని బుచ్చనపల్లె షిరిడిసాయి ఆలయంలో గురువారం గురుపౌర్ణమి వేడుక ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామికి ప్రత్యేక అభిషేకం, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్తలు కూకట్లపల్లి వెంకమ్మ, నారాయణ భక్తులకు అన్నదానం ఏర్పాటుచేశారు. అనంతరం జరిగిన ఉమ్మడి కడప జిల్లా చెక్కభజన (కులుకుభజన) పోటీల్లో విజేతలకు వరుస బహుమతులు రూ.50వేలు, రూ.30వేలు. రూ.20వేలు ధర్మకర్తలు అందజేశారు.

బ్రహ్మంగారిమఠం(చాపాడు): పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి మఠంలో గురు పౌర్ణమి ఘనంగా నిర్వహించారు. పూర్వ మఠాధిపతులు వీరభోగ వసంత వెంకటేశ్వరస్వామికి ఆయన కుమారుడు వెంకటాద్రిస్వాముల విశేష పూజలు జరిపారు. ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు. జగన్మాత ఈశ్వరీదేవి మఠం వద్ద విరాట్ విశ్వకర్మ భగవానుడు, మాతా గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి, ఈశ్వరీదేవి మాతలకు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈశ్వరీదేవి మఠాధిపతులు వీరశివకుమార స్వామి, పూర్వపు మఠాధిపతులు, శిష్యులు గురుపూజ నిర్వహించారు.



ప్రొద్దుటూరు వైఎంఆర్ కాలనీలో బాబాకు అలంకరణ



ప్రొద్దుటూరు బాబా ఆలయంలో భక్తులు

రాజుపాళెం: మండలంలోని వెలవలి బాబా ఆలయంలో భక్తులు స్వామికి కాయాకర్పూరం సమర్పించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

తల్లిదండ్రుల చొరవతోనే పిల్లలకు ఉజ్వల భవిత



చాపాడులో మొక్కలు పట్టుకున్న విద్యార్థులు



పోరుమామిళ్లలో మాట్లాడుతున్న డీసీ. గోవిందరెడ్డి



పిల్లలతో కలసి భోజనం చేస్తున్న డ్వామా పీడీ

మైదుకూరు: పిల్లల ఉజ్వల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో తల్లిదండ్రుల పాత్ర ఎంతో ఉందని మైదుకూరు తహసీల్దారు రాజసింహ నరేంద్ర పేర్కొన్నారు. పట్టణంలోని కస్తూర్బా పాఠశాలలో గురువారం జరిగిన మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దాలన్నారు. అనంతరం ఆటల పోటీల్లో విజేతలైన తల్లిదండ్రులకు తహసీల్దారు బహుమతులు అందజేశారు. తల్లి పేరుతో మొక్కలను అందజేశారు. స్థానిక ప్రగతి జూనియర్ కాలేజీలో తల్లిదండ్రులు, అధ్యాపకులు, విద్యార్థులు కాలేజీ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ శ్రీలత, కళాశాల కరస్పాండెంట్ టి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

కాశినాయన: మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో గురువారం తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశాలు జరిగాయి. తల్లిదండ్రులకు ఆటల పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందించారు.

పిల్లల స్థితిగతులను తెలుసుకోవాలి

చాపాడు: తల్లిదండ్రులు పాఠశాలకు వెళ్లి పిల్లల స్థితిగతులు తెలుసుకోవాలని మండల ప్రత్యేకాధికారి విజయలక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో గురువారం మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ నిర్వహించారు. ప్రత్యేకాధికారి మాట్లాడుతూ తల్లిదండ్రులు ఒక మొక్క నాటి సంరక్షించాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు ప్రొగ్రెస్ కార్డు, గ్రీన్ ట్రీ పాస్‌పోర్టు కార్డు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చింతకుంట మహబూబ్‌బీ, తహసీల్దారు రమాకుమారి, ఎంఈఓ రవిశంకర్, బత్తుల ఆదిలక్ష్మి, వెంకటలక్ష్మీ, అలీ, శర్మ, హరికృష్ణ, బయపరెడ్డి, సుబ్బరాయుడు, బత్తల కిరణ్, సలీం, సుబ్రహ్మణ్యం, రవి తదితరులు పాల్గొన్నారు.

బాగా చదివి ఉన్నత శిఖరాలకు చేరాలి

కలసపాడు: విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఎంపీడీఓ మహబూబ్‌బీ తెలిపారు. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశాలను నిర్వహించారు. ఎగువ రామాపురం జెడ్పీ పాఠశాలలో చదివి పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులకు డి.తంబళ్లపల్లికి చెందిన ఎస్.కృష్ణారెడ్డి రూ.5 వేల చొప్పున, ఈ.తంబళ్లపల్లికి చెందిన కాశిరెడ్డి రూ.5వేలు చొప్పున అందించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం మెర్సీమాలిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. సెయింట్ ఆంటోని ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో జరిగిన సమావేశంలో సర్పంచ్ శివలీల, ఎంఈఓ మస్తాన్‌వలి పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. హెచ్ఎం చిత్తా ప్రభావతి, చిత్తా రాజశేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమాజంలో ఎదిగేలా తీర్చిదిద్దాలి

పోరుమామిళ్ల: విద్యార్థి సమాజంలో ఎదిగి ఉత్తములుగా ఉండేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తీర్చిదిద్దాలని ఎమ్మెల్సీ డీసీ.గోవిందరెడ్డి అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ రామిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్సీ మాట్లాడుతూ పిల్లల సంరక్షణ, చదువులో తల్లిదండ్రుల బాధ్యత ఉన్నా, మెరుగైన పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత తండ్రిదే అన్నారు. విద్యాసంస్థలో భవనాలు, మెటీరియల్ ముఖ్యం కాదని, ఉపాధ్యాయులు ఏమి చెప్పారనేదే ముఖ్యమని గోవిందరెడ్డి అన్నారు. కళాశాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని గోవిందరెడ్డి చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చిత్తా రవిప్రకాష్‌రెడ్డి, మహబూబ్ పీర్, చెన్నరాయుడు, సుబ్బరామిరెడ్డి పాల్గొన్నారు.

పోరుమామిళ్ల: స్థానిక ఓఎల్ఎఫ్ బాలికోన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌లో డ్వామా పీడీ శేషారెడ్డి పాల్గొన్నారు. ఆత్మీయ సమావేశం ఉద్దేశం, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల కర్తవ్యం గురించి ఆయన వివరించారు. పిల్లలు, తల్లిదండ్రులతో కలసి భోజనం చేశారు. సమావేశానికి వచ్చిన తల్లిదండ్రులకు పండ్ల మొక్కలు పంపిణీ చేసి మొక్కలు పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఉపేంద్రారెడ్డి, ఎంఈఓ వెంకటరెడ్డి, ఏపీఓ, ఈసీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మొక్కుబడిగా మెగా పేరెంట్స్ సమావేశం



ఎస్‌పీజీ కాంపౌండ్ పాఠశాలలో ముగ్గురు విద్యార్థులు

ప్రొద్దుటూరు కల్చరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మెగా పేరంట్స్, టీచర్స్ సమావేశం ప్రొద్దుటూరులోని కొన్ని పాఠశాలల్లో మొక్కుబడిగా సాగింది. అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్‌లో 550 మంది విద్యార్థులు ఉండగా 150 మంది తల్లిదండ్రులు సమావేశంలో పాల్గొన్నారు. మీటింగ్ నిర్వహించి భోజనం పెట్టి పంపించారు. ఎస్పీజీ కాంపౌండ్‌లోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో ముగ్గురు విద్యార్థులు ఉండగా ఆ ముగ్గురి తల్లులతో సమావేశం నిర్వహించారు. వెదుర్ల బజార్‌లోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో 8 మంది విద్యార్థుల ఉండటంతో పేరంట్స్, టీచర్స్ మీటింగ్ తూతూ మంత్రంగా సాగింది. డ్రైవర్ కొట్టాల, సుందరాచార్యుల వీధిలోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండటంతో మొక్కుబడిగా జరిగింది. మండలంలో 111 పాఠశాలలు ఉండగా చాలా పాఠశాలల్లో తూతూ మంత్రంగా సాగింది. మొక్కలను నాటాల్సి ఉండగా చాలా కొన్ని పాఠశాలలో మొక్కలు సరఫరా అయ్యాయి. అన్ని పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రులకు ఆటల పోటీలు నిర్వహించాల్సి ఉండగా కొన్ని పాఠశాలల్లోనే నిర్వహించారు. శ్రీవిద్య జూనియర్ కళాశాలలో నిర్వహించిన మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశంలో త్రీటౌన్ సీఐ గోవిందరెడ్డి మాట్లాడుతూ నైతిక విలువలను పెంచుకోవాలని, చెడు అలవాట్లను వదిలేయాలని, చదువు ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమణరావు, యూనియన్ బ్యాంక్ మేనేజర్ రాజశేఖర్‌రెడ్డి, కళాశాల కరస్పాండెంట్ శ్రీకాంత్ కుమార్‌రెడ్డి, డైరెక్టర్ రామమోహన్, అధ్యాపకులు పాల్గొన్నారు. మోడంపల్లె మున్సిపల్ ఉర్దూ హైస్కూల్‌లో మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విట్నెస్‌గా మున్సిపల్ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ నూర్ అహ్మద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులను ప్రదానం చేశారు. విద్యార్థుల ప్రగతి గురించి వారి తల్లిదండ్రులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ శోభారాణి, పాఠశాల హెచ్ఎం ఇమాంహుస్సేన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అభ్యాస్ జూనియర్ కళాశాలలో ఎంపీసీలో మంచి మార్కులు సాధించిన కుషాలినికి రూ.10వేలు, జేఈఈ మెయిన్స్‌లో ర్యాంక్ సాధించిన చైతన్య కుమార్‌కు రూ.20వేలు నగదు బహుమతిని కళాశాల కరస్పాండెంట్ బచ్చల ప్రతాప్, ప్రిన్సిపల్ జగదీశ్వర్‌రెడ్డి అందజేశారు.

పిల్లల చదువుపై తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలి

ప్రొద్దుటూరు కల్చరల్: తల్లిదండ్రులు పిల్లల చదువు పట్ల శ్రద్ధ వహించాలని ఉపవిద్యాశాఖాధికారి మీనాక్షి పేర్కొన్నారు. స్థానిక వైవీఎస్ మున్సిపల్ గర్ల్స్ హైస్కూల్‌లో జరిగిన మెగా పేరంట్స్, టీచర్స్ సమావేశంలో ఆమె మాట్లాడుతూ పిల్లలను రోజూ పాఠశాలకు పంపాలని, సెల్‌ఫోన్ ఇవ్వరాదని చెప్పారు. అనంతరం ముగ్గుల పోటీ, టగ్ ఆఫ్‌వార్ పోటీలు జరిపి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు విజయభాస్కర్‌రెడ్డిపాల్గొన్నారు. హోమస్‌పేట ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు రవీంద్రుడు ఆధ్వర్యంలో పేరంట్స్, ఉపాధ్యాయుల సమావేశం సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులకు పలు సూచనలు చేశారు. పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. ఆదరణ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో 250 మంది విద్యార్థులకు చిప్పగిరి ప్రసాద్ విద్యా సామగ్రి పంపిణీ చేశారు. స్థానికులు పాల్గొన్నారు.